ధాన్యం విక్రయించిన 48 గంటల్లో డబ్బు చెల్లింపు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: వానాకాలం ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం సమీకృత పాలనా ప్రాంగణంలో ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో చెల్లింపుల ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం తనిఖీ

పెద్దపల్లి పురపాలక సంఘం పరిధిలో స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. పురపాలిక కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం నూతన భవన నిర్మాణం పనులను పరిశీలించారు. డిజిటల్ కార్డుల డాటా ఆన్‌లైన్ నమోదు తీరును అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్, టీపీఎస్ వినయ్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు స్కూటర్లు

మహిళలకు మెరుగైన సేవలందించేందుకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు స్కూటర్లు అందజేస్తున్నట్లు కలెక్టర్ శ్రీహర్ష పేర్కొన్నారు. బుధవారం ఆయన అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సమీకృత పాలనా ప్రాంగణంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు 31, సఖీ కేంద్రం నిర్వాహకులకు మూడు స్కూటర్లు పంపిణీ చేశారు. జిల్లా సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్, ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు ద్విచక్రవాహనాలు అందజేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

అందని సీడీపీ నిధులు.. సాగని పనులు

ఈ ఏడాదిలో విడుదల ఊసే లేదు




ఈనాడు, కరీంనగర్

ఉమ్మడి జిల్లాకు ఈ వార్షిక సంవత్సరం (2024-25)లో రావాల్సిన నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (సీడీపీ) నిధుల ఊసే లేదు. దీంతో నాలుగు జిల్లాల పరిధిలో గెలిచిన ఎమ్మెల్యేలు.. చేపట్టాల్సిన ప్రగతి పనుల విషయంలో మల్లగుల్లాలు పడుతున్నారు. గతేడాది నవంబరులో జరిగిన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు తోడుగా.. కొత్త పనుల కోసం వెచ్చించాల్సిన నిధులు ఇంకా రాకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పెరుగుతున్నాయి. గ్రామాలు, పట్టణాల నుంచి ఎమ్మెల్యేలకు పలు అభివృద్ధి పనులకు సంబంధించి దండిగా ప్రతిపాదనలు అందుతున్నాయి. ఇటీవల వరదల కారణంగా చాలాచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. వాటికి సంబంధించిన ప్రతిపాదనలకు కూడా ప్రత్యేక ప్యాకేజీ రాకపోవడంతో కళ్లముందు కనిపిస్తున్న పనులకు నిధులను ఏ విధంగా సమకూర్చాలనేది అటు అధికారులకు.. ఇటు నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు సమస్యగా మారింది.

రాష్ట్రం ఏర్పాటయ్యాక రెండింతలు..

కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌డీపీ) నిధి పేరిట ప్రతి శాసనసభ నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున మంజూరు చేసింది. దీనికి అదనంగా సీడీపీ నిధులు కూడా అందితే ఎమ్మెల్యేలకు వచ్చే వినతులకు మోక్షం లభించేది. నియోజకవర్గ అభివృద్ధి నిధి ద్వారా ప్రస్తుతం రూ.5కోట్ల చొప్పున రావాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఏటా రూ.50 లక్షలు మాత్రమే ఇచ్చేవారు. తరువాత కొన్నాళ్లకు రూ.75 లక్షలు ఆ తరువాత రూ.కోటి యాభై లక్షలకు పెంచారు. తెలంగాణ ఏర్పాటయ్యాక రెండింతలు చేశారు. 2018 నుంచి రూ.5 కోట్లను అందిస్తూ వస్తున్నారు.



సుల్తానాబాద్: అసంపూర్తిగా ఉన్నత పాఠశాల భవన నిర్మాణం

రూ.120 కోట్లపైనే ఆశలు..

గతేడాది నవంబరులో ఎన్నికలు జరగడం డిసెంబరులో కొత్త ప్రభుత్వం ఏర్పాటవడంతో ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి ఈ ప్రత్యేక అభివృద్ధి నిధిని అన్ని నియోజకవర్గాలకు కేటాయించారు. ఇలా 12 నియోజకవర్గాలకు రూ.10కోట్ల చొప్పున వచ్చిన రూ.120 కోట్లను వినియోగించడంపైనే ప్రస్తుతం అందరూ దృష్టి సారిస్తున్నారు. వీటిని పాత పనులకు పెట్టకూడదనే నిబంధనను అమలు చేస్తున్నారు. ఇందులో నుంచి తాగునీటికి రూ.కోటి, బడుల్లో మౌలిక వసతుల కోసం రూ.2 కోట్లు ప్రతి ఎమ్మెల్యే ఖర్చు చేయాలి. అంతేకాకుండా కలెక్టర్, జిల్లా అధికారుల ప్రతిపాదనలతో ప్రభుత్వ భవనాల మరమ్మతులకు రూ.50 లక్షలు విధిగా కేటాయించాలి. మిగిలిన రూ.6.5 కోట్లను ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించాలి.

అన్నింటికీ ఎస్‌డీపీ నిధులే ఆధారం..

12 నియోజకవర్గాల పరిధిలో కొత్తగా ఈ ఏడాదిలోనే 1500కుపైగా ప్రతిపాదనలు అందినట్లు అధికారులు చెబుతున్నారు. వీటన్నింటికి ఎస్‌డీపీ నిధులే ఆధారమవుతున్నాయి. ప్రతి పనికి ఇన్‌ఛార్జి మంత్రి అనుమతితోనే నిధులు విడుదల చేయాల్సి ఉండటంతో ఇబ్బంది ఏర్పడుతోంది. పూర్తిస్థాయిలో నిధులు రాకపోవడంతో అందిన ప్రతిపాదనలకు ఎమ్మెల్యేలు న్యాయం చేయలేకపోతున్నారు. మరోవైపు కార్యాలయాలకు వచ్చిన ప్రతిపాదనల్లో వేటికి ప్రాధాన్యత నివ్వాలనేది యంత్రాంగానికి తలనొప్పిగా మారుతోంది.



అద్దెల ఆదాయం.. దళారుల భోజ్యం

జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన సముదాయాల తీరు



న్యూస్‌టుడే, పెద్దపల్లి

ప్రభుత్వ సంస్థలకు చెందిన దుకాణ సముదాయాలు దళారులకే కాసులు కురిపిస్తున్నాయి. ఏళ్ల కిందట గదులు చేజిక్కించుకున్న వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరకు ఇతరులకు అద్దెకు ఇస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అద్దె పెంపునకు పలుమార్లు ప్రయత్నాలు జరిగినప్పటికీ రాజకీయ కారణాలతో కార్యరూపం దాల్చలేదు. పెద్దపల్లిలోని పురపాలిక వాణిజ్య భవన సముదాయంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల వాణిజ్య సముదాయానిదీ ఇదే పరిస్థితి. ఇటీవల మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డుకు సంబంధించిన అద్దె గదులు అధిక రేట్లకు పలకడంతో మరోసారి వాణిజ్య సముదాయం అద్దెలు చర్చనీయాంశమయ్యాయి.



మున్సిపల్ వాణిజ్య భవన సముదాయం

గడువు ముగిసినా పాత లెక్కనే!

పెద్దపల్లి బాలుర జూనియర్ కళాశాల భవనానికి రాజీవ్ రహదారి వైపు 2004లో 24 గదులతో వాణిజ్య భవన సముదాయం నిర్మించారు. అప్పట్లో ఒక్కో గదికి రూ.50 వేల చొప్పున అడ్వాన్సు ఇచ్చి దక్కించుకున్న వ్యక్తులు ప్రతి నెలా రూ.500 చొప్పున కళాశాల యాజమాన్య కమిటీకి చెల్లించాల్సి ఉంటుంది. ఏటా 5 శాతం అద్దె పెంపు, పదేళ్లకోసారి రీషెడ్యూలు చేయాలి. 2014లో రీ షెడ్యూలు చేయగా గత మార్చితో పదేళ్ల గడువు ముగిసింది. గదులను అద్దెకు తీసుకున్నవారు వాటిని తమకు కేటాయించాలని, ఇందుకోసం రీ టెండర్ నిర్వహించాలని అభ్యర్థించారు. అధికారులు ఏ నిర్ణయమూ తీసుకోలేదు. ఒకవేళ రీషెడ్యూలు చేసినా మున్సిపల్ అధికారులు మార్కెట్ సర్వే చేసి, నిర్ణయించిన దానిపై 15 శాతం పెంచి అద్దె నిర్ణయించాలి. ఇవేవీ లేకుండానే ఆరు నెలలు గడిచిపోయాయి.

నిలిచిన వేలం ప్రక్రియ

పెద్దపల్లి మున్సిపాలిటీకి కూరగాయల మార్కెట్‌లో జెండా రోడ్డువైపు 20 గదులతో వాణిజ్య సముదాయముంది. పాతికేళ్ల కిందట నిర్మించిన భవనంలో గదులను గతంలో టేలాలు వేసుకున్న వారికి కేటాయించారు. అందులో మెజారిటీ గదులను ఇతరులకు అద్దెకిచ్చారు. పురపాలికలకు నామమాత్రంగా అద్దె చెల్లిస్తూ ఇతరుల నుంచి నెలకు రూ.10 వేల చొప్పున తీసుకుంటున్నారు. గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు పలుమార్లు అద్దెను సవరించారు. గతేడాది పెంచిన అద్దెను గదుల యజమానులు చెల్లించకపోవడంతో తిరిగి వేలం నిర్వహణకు అధికారులు నోటీసులు జారీ చేశారు. రాజకీయ కారణాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. దీనిపై ఫిర్యాదు స్వీకరించిన అదనపు కలెక్టర్ అరుణశ్రీ గదుల అద్దె పెంపుపై కీలక ఆదేశాలు జారీ చేయడంతో మున్సిపల్ అధికారులు కార్యాచరణ చేపట్టారు.

వ్యవసాయ మార్కెట్ భవనం స్ఫూర్తి

పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లోని వాణిజ్య సముదాయంలోని 15 గదులకు ఇటీవల మార్కెటింగ్ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. ఒక్కో గది కనిష్ఠంగా రూ.19 వేలు, గరిష్ఠంగా రూ.26 వేల వరకు పలికింది. ఈ వేలం స్ఫూర్తితో కూరగాయల మార్కెట్ వాణిజ్య సముదాయం ధరల సవరణకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

రీ టెండరుకు ప్రతిపాదనలు

కళాశాల భవన సముదాయం గదుల రీ టెండరు నిర్వహణకు రాష్ట్ర ఉన్నతవిద్యా మండలి కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించాం. అక్కడి నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో గతంలో మాదిరిగానే పది శాతం అద్దె పెంచి తీసుకుంటున్నాం. ఇది కూడా తాత్కాలిక పద్ధతిపైనే ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే గదులకు వేలం నిర్వహిస్తాం.

-బి.గంగయ్య, ఆర్డీవో (కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు)



ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో కూల్చిన కట్టడం

అనుమతి లేని కట్టడం నేలమట్టం

గోదావరిఖని గౌతమినగర్ సమీపంలోని ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన ఓ భవనాన్ని నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు బుధవారం కూల్చివేశారు. నగరపాలక అనుమతితోనే నిర్మాణాలు చేపట్టాలని.. లేనిచో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ శ్రీధర్‌ప్రసాద్, ప్రణాళిక పర్యవేక్షకులు నవీన్ హెచ్చరించారు.

-న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

రుడా దిశగా అడుగులు

రెండు పుర, నగరపాలక సంస్థ కలిపి ● ప్రభుత్వానికి చేరిన నివేదికలు



గోదావరిఖని, న్యూస్‌టుడే

రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) ఏర్పాటుకు వేగంగా చర్యలు చేపడుతున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం కసరత్తు పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించింది. పెద్దపల్లి, మంథని పురపాలక సంఘాలతో పాటు.. రామగుండం నగరపాలక సంస్థను అలాగే కమాన్‌పూర్, రామగిరి, అంతర్గాం, పాలకుర్తి, ఎండపల్లి, ధర్మారం మండలాలను కలుపుకుని 'రుడా' ఏర్పాటు చేసేందుకు యంత్రాంగం కసరత్తు పూర్తిచేసింది. దీని పరిధిలో సుమారు 6 నుంచి 7 లక్షల జనాభా ఉండే విధంగా ప్రణాళికలు చేస్తున్నారు. భారీ పరిశ్రమలకు నిలయమైన పెద్దపల్లి జిల్లాలో 'రుడా' ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం దాదాపుగా అన్ని రకాలుగా కసరత్తు చేసింది.

పంచాయతీలు యథావిధిగా..

రుడా ఏర్పాటుతో పంచాయతీల స్వయం ప్రతిపత్తికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు. పంచాయతీల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం యథావిధిగా అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు రుడా ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. రామగుండం.. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద ఉండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ప్రత్యేక నిధులు విడుదలవుతాయి. స్థానికంగా వసూలుచేసే వివిధ రకాల పన్నులను కూడా ఇక్కడే అభివృద్ధి కోసం వెచ్చించుకునే అవకాశం ఉంటుంది. మౌలిక సదుపాయాలు, తాగునీటి సమస్యలపై అదనంగా నిధులు కేటాయించనున్నారు.

బి-కేటగిరీ నగరంగా గుర్తింపు..

రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీతో బి-కేటగిరి నగరంగా గుర్తించనున్నారు. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు కూడా ఇది వర్తిస్తుంది. గ్రామాలు కూడా పట్టణీకరణకు నోచుకోనున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనాల్లో పెరుగుదల ఉంటుంది. తాత్కాలిక కార్మికులకు సంబంధించి సౌకర్యాలు పెరిగే అవకాశమూ ఉండనుంది. రుడా పరిధిలో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరాం సిమెంటు ఫ్యాక్టరీ, జెన్‌కో విద్యుత్తు కేంద్రాలు ఉండటంతో మరిన్ని నిధులు అభివృద్ధి కోసం వెచ్చించుకోవచ్చు.

వచ్చే క్యాబినెట్‌లో ఆమోదం

వచ్చే మంత్రివర్గ సమావేశంలో 'రుడా' ఏర్పాటుకు ఆమోదం తెలపనున్నారు. దీని వల్ల ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు వచ్చే అవకాశముంది. పట్టణీకరణ పెరుగుతుంది. రుడా వల్ల ఎవరికి ఇబ్బంది ఉండదు. కొంతమందిలో అపోహలున్నాయి. రుడాతో ఏ గ్రామానికి నష్టం జరగదు. అభివృద్ధి చేసుకోవడానికి నిధుల కొరత ఉండదు. రుడా పరిధిలో ఉన్న పట్టణాలు, గ్రామాలకు దీని నిధులు కేటాయించుకోవచ్చు.

- మక్కాన్‌సింగ్, ఎమ్మెల్యే

విపణులు.. విరుల వనాలు

సద్దుల బతుకమ్మ పండుగ నేపథ్యంలో పట్టణాల్లోని మార్కెట్ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు పూల వ్యాపారులు, వినియోగదారులతో కళకళలాడాయి. బతుకమ్మల తయారీకి వినియోగించే తంగేడు, గునుగు, పట్టుకుచ్చులు, బంతి పూలకు గిరాకీ పెరిగింది. పెద్దపల్లి జెండా కూడలి ప్రాంతం బుధవారం పూల దుకాణాల వద్ద కొనుగోలుదారులతో కిటకిటలాడింది. సుల్తానాబాద్ మార్కెట్లో పూల రకాన్ని బట్టి కట్టకు రూ.10, కిలో బంతి పూలకు రూ.100 వరకు పలికాయి. **-న్యూస్‌టుడే, పెద్దపల్లి, సుల్తానాబాద్**



పెద్దపల్లిలో సందడిగా జెండాకూడలి



సుల్తానాబాద్ మార్కెట్లో ఏర్పాటు చేసిన పూల దుకాణాలు

శ్రమించారు.. లక్ష్యం ఛేదించారు

అలుపెరగని సన్నద్ధతతో ఉపాధ్యాయ కొలువు



న్యూస్‌టుడే, మార్కండేయకాలనీ(జ్యోతినగర్)

వీరంతా ఒక లక్ష్యాన్ని ఎంచుకొని.. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఓ ఉద్యోగం చేసుకుంటూ సన్నద్ధమయ్యారు. ఒకరు గురుకుల ఉపాధ్యాయురాలిగా, మరొకరు పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో అనుకున్న లక్ష్యం దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో సన్నద్ధమయ్యారు. గతంలో కోల్పోయిన అంశాలను పూర్తిస్థాయిలో సానబెట్టి యత్నించారు. కొలువు సాధించిన సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వీరిపై న్యూస్‌టుడే కథనం...

రెండు ఉద్యోగాలు..



గోదావరిఖనికి చెందిన తంగళ్లపల్లి శ్యామల-సుందరయ్యల కుమార్తె శ్రీలక్ష్మి రెండు ఉద్యోగాలు సాధించారు. తండ్రి చనిపోగా.. తల్లి పెంపకంలో పట్టుదలతో చదివారు. గత డీఎస్సీలో 14వ ర్యాంకు సాధించినప్పటికీ.. సరిపడా పోస్టులు లేకపోవడంతో కొలువు దక్కలేదు. 2023లో గురుకుల ఉద్యోగం సాధించి బెల్లంపల్లి పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. డీఎస్సీలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యం కోసం ప్రయత్నించగా.. ఇటీవల వెలువడిన ఫలితాల్లో సెకండరీ గ్రేడ్‌లో 14, స్కూల్ అసిస్టెంట్‌లో 4వ ర్యాంకు సాధించారు.

రక్షణ నుంచి బోధన వైపు



రామగుండం కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్న బందారపు మమత.. ఆమె అనుకున్న లక్ష్యం కోసం శ్రమించారు. డీఎస్సీ ఫలితాల్లో 6వ ర్యాంకు సాధించి ఎస్‌జీటీలో ఉద్యోగానికి ఎంపికయ్యారు. 2017 డీఎస్సీలో పోస్టులు తక్కువగా ఉండటంతో సాధించలేకపోయారు. అనంతరం పోలీస్ కానిస్టేబుల్‌కు సన్నద్ధమై.. ఏఆర్ విభాగంలో ఉద్యోగం సాధించారు. అయితే ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగాలన్న సంకల్పంతో డీఎస్సీ ఫలితాల్లో 75.30 మార్కులు సాధించి కొలువు దక్కించుకున్నారు.

చివరి అవకాశంగా ప్రయత్నించి..

వెనుగంటి శ్రీనివాస్



చేనేత కుటుంబానికి చెందిన శ్రీనివాస్ గతంలో గోదావరిఖనిలో గడియారాలు బాగు చేసుకుంటూ జీవనం కొనసాగించారు. రోడ్డు విస్తరణలో భాగంగా దుకాణం తీసివేయడంతో.. ఉద్యోగంపై దృష్టి సారించారు. చివరి ప్రయత్నంగా డీఎస్సీ ఫలితాల్లో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఎంపికయ్యారు. గతంలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ రెండు ఉద్యోగాలకు 1:3 నిష్పత్తి వరకు వెళ్లారు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో 76.01 మార్కులతో 5వ ర్యాంకు సాధించారు. తండ్రి రాజవీరు చనిపోగా.. తల్లి రాజేశ్వరి కూలీ పని చేసుకుంటూ పోషించారు.

గోడలకు బీటలు.. ఇళ్లలోకి కీటకాలు



మంథని పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు సమకూరడం లేదు. స్థానిక చైతన్యపురి కాలనీలో నిలిచిన మురుగు చెరువును తలపిస్తోంది. మురుగు వెళ్లడానికి కాలువలు లేక అక్కడే పేరుకుపోతోంది. పిచ్చి మొక్కలతో నిండి పాములు, కీటకాలు ఇళ్లలోకి చేరుతున్నాయి. అధికారులకు సమర్పిస్తున్న వినతిపత్రాలు బుట్టదాఖలవుతున్నాయి. నీరు ఎప్పుడూ నిల్వ ఉండటంతో పక్కనున్న ఇళ్ల గోడలకు తేమ వచ్చి బీటలు వారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-న్యూస్‌టుడే, మంథని గ్రామీణం

జలకాలుష్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఫెర్టిలైజర్ సిటీ, న్యూస్‌టుడే: రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి వ్యర్థజలాలు బయటకు పోకుండా సంపూర్ణంగా శుద్ధిచేసి బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని సంస్థ ఛైర్మన్ శరవణన్ ఆదేశించారు. బుధవారం ఆయన కర్మాగారాన్ని సందర్శించారు. వివిధ విభాగాల అధికారుల సమావేశంలో మాట్లాడుతూ కాలుష్య జలాలతో పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బంది పడకుండా సత్వరమే జడ్.ఎల్.డి యూనిట్ నిర్మాణం పనులను మొదలు పెట్టాలన్నారు. వివిధ బ్యాంకర్లతో సంప్రదించి ఒప్పంద కార్మికులకు బీమా సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు అశోక్ సింఘాల్, చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయరాజ హంస తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్ఎఫ్‌సీఎల్ ఛైర్మన్ శరవణన్

రాజధానికి తరలిన కొత్త గురువులు

డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు ఉపాధ్యాయులుగా నియామక పత్రాలు అందుకోవడానికి బుధవారం హైదరాబాద్ తరలివెళ్లారు. పెద్దపల్లి సమీకృత పాలనా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సును జిల్లా విద్యాధికారి మాధవి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాకు చెందిన 77 మంది సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు.

-న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్



ప్రత్యేక బస్సులో బయల్దేరుతున్న అభ్యర్థులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే – మంథని గ్రామీణం

? మంథని చైతన్యపురి కాలనీకి కొన్ని రోజులుగా తాగునీరు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. -కాలనీవాసులు

✔ సమస్యపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం. సక్రమంగా తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. -మనోహర్, ఇన్‌ఛార్జి కమిషనర్

న్యూస్‌టుడే –సుల్తానాబాద్

? సుల్తానాబాద్ శాస్త్రీనగర్ సమీప పొలాల వద్ద ఎస్సారెస్పీ డీ86 కాల్వ గట్టుపై విద్యుత్తు తీగలు వదులుగా ఉండి ప్రమాదకరంగా మారాయి. -రాజేశం, రైతు

✔ ఈ సమస్య మా దృష్టికి రాలేదు. పరిశీలించి పరిష్కరిస్తాం. -విద్యుత్తు శాఖ ఏఈ శంకర్

బావి చుట్టూ పిచ్చిమొక్కల తొలగింపు

ఈనాడు స్పందనకు వందనం

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కమాన్‌పూర్ నుంచి దాసరిపల్లికి వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న బావిపై 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బావి చుట్టూ రక్షణ చర్యలు చేపట్టారు. పొక్లెయిన్‌తో పొచ్చి మొక్కలు తొలగించారు.



జాతీయ మానిటరింగ్ కమిటీ సభ్యుల పర్యటన

ఓదెల, న్యూస్‌టుడే: గుంపుల, పొత్కపల్లి గ్రామాల్లో జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీలకు 2022 నుంచి వచ్చిన నిధులు, ఉపాధిహామీలో చేసిన పనులను పరిశీలించారు. స్వశక్తి మహిళలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పింఛను లబ్ధిదారులు, జాబ్‌కార్డుల వివరాలపై ఆరా తీశారు. జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యులు సీవీ బాలమురళి, సునీల్, ఎంపీడీవో తిరుపతి, జిల్లా ఎస్‌బీఎం అధికారి రాఘవులు, విజిలెన్స్ అధికారి కొమురయ్య, ఏపీవో రమేష్, ఈసీ శ్వేత, పంచాయతీ కార్యదర్శులు రాకేశ్‌వర్మ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.




గుంజపడుగులో.. మంథని హనుమాన్‌నగర్‌లో..



ఖిలావనపర్తిలో చండీహోమం



పొత్కపల్లిలో కుంకుమ పూజలు



గుండారంలో కుంకుమ పూజలు పాల్గొన్న మహిళలు

చదువుల తల్లిగా దుర్గామాత

బుధవారం మూల నక్షత్రం కలిసి రావడంతో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు చోట్ల మండపాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. **-న్యూస్‌టుడే బృందం**



చీకురాయిలో..



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉపాధ్యాయ నియామక పత్రం అందుకున్న గడ్డం శ్రీనివాస్(మంథని)ను అభినందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు. –ఈనాడు, హైదరాబాద్

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం

మంథని, న్యూస్‌టుడే: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆర్డీవో హనుమానాయక్ కోరారు. బుధవారం మంథని ఆర్డీవో కార్యాలయంలో అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. గతంలో ఓటరు జాబితాలో పేర్లున్న వారు కూడా తప్పనిసరిగా కొత్తగా నమోదు చేసుకోవాలన్నారు. ధ్రువపత్రాలతో ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో లేదా ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. సమావేశంలో పది మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, భారాస, కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు సమ్మయ్య, అజీమ్‌ఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమానాయక్

ప్రత్యేకాధికారిగా బాధ్యతల స్వీకరణ

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): రామగిరి మండల ప్రత్యేకాధికారిగా ఆర్డీవో హనుమానాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు మండల ప్రత్యేకాధికారిగా డీపీవో వీరబుచ్చయ్య వ్యవహరించారు.



జీడీకే-II గనిపై బోనంతో ప్రదర్శన



రామగిరి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో..

కాలనీల్లో కోలాహలం

న్యూస్‌టుడే, యంత్రాంగం: జిల్లా వ్యాప్తంగా బతకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఊరూరా మహిళలు, యువతులు కోలాటాలతో సందడి చేశారు. పలు బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. చిన్నారుల సందడితో కాలనీలు కోలాహలంగా మారాయి.



దుర్గాదేవి వద్ద హారతి ఇస్తున్న సింగరేణి సీఎండీ సతీమణి శారద



ఖని: అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



ఖని: ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో బతుకమ్మ సంబరాల్లో వైద్యులు



మార్కండేయకాలనీ: నృత్యం చేస్తున్న చిన్నారులు

పర్వతారోహణ బృందంలో గర్రెపల్లి యువతి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్ మనాలిలోని పతల్స్ పర్వతాన్ని సుల్తానాబాద్ మండలం గర్రెపల్లికి చెందిన పసెడ్ల సహస్ర అధిరోహించారు. 'మాదకద్రవ్యాల నియంత్రణలో యువత భాగస్వామ్యం'లో భాగంగా 'ఎస్ ఫర్ లైఫ్, నో టూ డ్రగ్స్' అనే నినాదంతో కరీంనగర్ శ్రీచైతన్య డిఫెన్స్, క్రీడా అకాడమీ ఆధ్వర్యంలో చేపట్టిన పర్వతారోహణ బృందంలో ఆమె సభ్యురాలు.



పతల్స్ పర్వతాల వద్ద సహస్ర

సద్దుల వేడుకలకు ఏర్పాట్లు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లిలో గురువారం నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలకు మినీ ట్యాంక్‌బండ్ వద్ద చేసిన ఏర్పాట్లపై మున్సిపల్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మమతారెడ్డి మాట్లాడుతూ చెరువు కట్టపై విద్యుత్తు దీపాలతో అలంకరించడంతో పాటు బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కమిషనర్ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పట్టణంలోని అన్ని వార్డుల్లో బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పుర ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె పెద్దచెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన స్థలాలను చదును చేసి శుభ్రం చేసినట్లు, విద్యుత్తు దీపాలతో అలంకరించినట్లు పోలీసు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ అలీమొద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.



చెరువు కట్టను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్

సంక్షిప్తం

సంఘాలు–కార్యవర్గాలు

మార్కండేయకాలనీ: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా దాసరి రఘు ఏకగ్రీవంగా నియమితులయ్యారు.

పెద్దపల్లి, మంథని గ్రామీణం: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన పీఆర్టీయూ 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో జిల్లాకు చెందిన పలువురికి రాష్ట్ర కమిటీలో చోటుకల్పించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా సదాశివ్, నరేందర్,శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్,అసోసియేట్ మహిళా అధ్యక్షురాలిగా రాధ నియమితులయ్యారు.

కాలుష్య నివారణకు చర్యలు తీసుకోండి

ఫెర్టిలైజర్ సిటీ: రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి వెలువడుతున్న జల, వాయు, శబ్ద కాలుష్యాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎఫ్‌సీఎల్ ఛైర్మన్ శరవనన్‌ను.. మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్లు కోరారు. బుధవారం కర్మాగారంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మంథని: నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మంథనిలో విలేకరులతో మాట్లాడుతూ దీపావళి సందర్భంగా పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభించి, స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక సహాయం

గోదావరిఖని పట్టణం: నీట్‌లో 426వ ర్యాంకు సాధించి వైద్య కళాశాలలో ప్రవేశ రుసుం చెల్లించలేని మహబూబ్‌నగర్ జిల్లా సింహగిరికి చెందిన భాగ్యలక్ష్మీకి.. గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాల వైద్య విద్యార్థులు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం పంపించారు. చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే ఆర్థిక సహాయం అందించినట్లు మెడికోల ప్రతినిధి ప్రశాంత్ తెలిపారు.

పురస్కారాల పంపిణీ

గోదావరిఖని పట్టణం: పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, ఎంసెట్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను బుధవారం మార్కండేయకాలనీలో పంపిణీ చేశారు. రామ్మూర్తి, వీరమోహన్ పాల్గొన్నారు.

16న 'అలాయ్ బలాయ్'

గోదావరిఖని పట్టణం: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 16న గోదావరిఖని అడ్డగుంటపల్లిలో 'అలాయ్ బలాయ్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వేదిక జిల్లా కన్వీనర్ వెంకటరమణ తెలిపారు. వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

నిత్యావసరాల సరకుల పంపిణీ

గోదావరిఖని పట్టణం: నగరపాలక ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులకు పాదరక్షలు, కొబ్బరి నూనె, బెల్లం, సబ్బులు తదితర వాటిని బుధవారం పంపిణీ చేశారు. నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మేయర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ భాజపాను తీసుకెళ్లాలి

పెద్దపల్లి: భాజపాను గడపగడపకూ తీసుకెళ్లాలని పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం పెద్దపల్లిలోని జెండా చౌరస్తాలో పార్టీ సభ్యత్వ నమోదుకు ఆయన హాజరయ్యారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి


గోదావరిఖని: కోర్టు సిబ్బంది వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని జిల్లా ఆరో అదనపు జడ్జి శ్రీనివాసరావు సూచించారు. ఖనిలోని ఆరో అదనపు కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కోర్టు సూపరింటెండెంట్ శ్రీధర్, విజయసారథి పాల్గొన్నారు.

లారీ ఢీకొని కార్మికునికి గాయాలు

గోదావరిఖని: స్థానిక నగరపాలక కార్యాలయ సమీపంలో సైకిల్‌పై వెళ్తున్న ఓ పారిశుద్ధ్య కార్మికుడు సిగ ఐలయ్య(52)ను బుధవారం రాత్రి లారీ ఢీకొంది. దీంతో ఐలయ్య కాలు ఎముక విరిగింది. వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నిందితురాలి అరెస్టు

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): పీకేరామయ్యకాలనీకి చెందిన వృద్ధురాలు నిర్మలపై దాడి చేసి ఆభరణాలు అపహరించిన నిందితురాలు అశ్వినితండీని బుధవారం అరెస్టు చేసినట్లు ఎన్టీపీసీ ఎస్సై సతీష్ తెలిపారు. వృద్ధురాలికి మాయమాటలు చెప్పి చెట్ల పొదలకు తీసుకెళ్లి ఇష్టానుసారంగా దాడి చేసి, ఆభరణాలు ఎత్తుకెళ్లిన విషయం విదితమే. సీఐ ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి నిందితురాలిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.



గ్రామస్థులతో సమావేశమైన ఎస్సై నరేశ్

ఓడేడ్‌లో పోలీసుల పల్లె నిద్ర

ముత్తారం, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకే పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టినట్లు ముత్తారం ఎస్సై నరేశ్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఆయన ఓడేడ్‌లో పల్లెనిద్ర నిర్వహించారు. మూఢనమ్మకాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

కుటుంబ వేడుకలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు

సింగరేణి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలకు సంబంధించి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆర్జీ-3 ఇన్‌ఛార్జి జీఎం ఎన్.రాధాకృష్ణ సూచించారు. సెంటినరీకాలనీలోని రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో సంబంధిత విభాగాల ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లపై బుధవారం ఆయన పరిశీలించారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఉత్తమంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 10 ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఎస్‌వోటూ జీఎం రఘుపతి, పర్సనల్ విభాగాధిపతి సదుర్శనం, డీవైపీఎం సునీల్ ప్రసాద్, సివిల్ డీవైఎస్ఈ రామకృష్ణ, సూపర్‌వైజర్ యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళ ప్రదర్శన

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి ఆర్జీ-1 కమ్యూనిటీహాలులో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటుంది. వారం రోజులుగా చేనేత దుస్తుల ప్రదర్శన, అమ్మకం ఏర్పాటు చేయడంతో పలువురు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడ చీరలతోపాటు డ్రెస్ మెటీరియల్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వీటితో పాటు బెడ్, కుషన్ కవర్లు, డోర్ కర్టెన్ల విక్రయాలు విరివిగా చేపడుతున్నారు.



చేనేత హస్తకళా ప్రదర్శనలో వివిధ రకాల దుస్తులు

ముగిసిన క్రీడా పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ: రెండు రోజులుగా సింగరేణి ఆర్జీ-2 డివిజన్‌లో జరుగుతున్న కంపెనీ స్థాయి క్రీడాపోటీలు బుధవారం ముగిసాయి. కాలనీలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో జరిగిన పోటీల ముగింపు కార్యక్రమానికి ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై.. విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ నెల 23నుంచి కోల్ ఇండియాలో జరిగే పోటీలకు సింగరేణి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను పంపనున్నట్లు పేర్కొన్నారు.

ఒప్పంద కార్మికులకు పండుగ బోనస్

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు దసరా బోనస్ డబ్బులు చెల్లించారు. వంద మస్టర్లు దాటిన 641 మంది కాంట్రాక్టు కార్మికులకు జీఎం లలిత్‌కుమార్ బుధవారం చెక్కులు పంపిణీ చేశారు. తొలిసారి కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లిస్తున్నామన్నారు. అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు, పాల్గొన్నారు.

కోల్ ఇండియాకు ఎంపిక

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి స్థాయిలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో ఏరియా ఆస్పత్రి సీనియర్ స్టాఫ్ నర్సు కుసుమ స్వరూప విజేతగా నిలిచి కోల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. అదే విధంగా డబుల్స్ విభాగంలోనూ కుసుమ స్వరూప, దీప్తిలు విజేతగా నిలిచారు. సింగరేణి స్థాయిలో మొదటి స్థానం సాధించిన క్రీడాకారులను కోల్ ఇండియా పోటీలకు ఎంపిక చేశారు.



డబుల్స్‌లో కుసుమస్వరూప, దీప్తి

నేర వార్తలు

కడుపు నొప్పితో సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం మచ్చుపేట గ్రామానికి చెందిన సింగరేణి కార్మికుడు కోట సతీశ్(36) కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం సతీశ్ మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లోని ఆర్కే 6 గనిలో పని చేస్తున్నారు. ఆరు నెలలుగా ఆయన కడుపునొప్పితో బాధ పడుతున్నారు. దసరా నేపథ్యంలో స్వగ్రామం రాగా మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు గోదావరిఖని సింగరేణి ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.



సతీశ్

వివాహిత అనుమానాస్పద మృతి

ధర్మారం, న్యూస్‌టుడే: ధర్మారం మండలం బుచ్చయ్యపల్లికి చెందిన సత్తం కోమలత(32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై ఎస్.లక్ష్మణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం కోమలత మంగళవారం రాత్రి గుండెపోటు లేదా మరే ఇతర కారణంతో మృతి చెందినట్లు ఆమె సోదరుడు గట్టు రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్టు పై నుంచి పడి వృద్ధుడు..

మంథని గ్రామీణం: చెట్టుపై నుంచి జారి పడి వృద్ధుడి మృతి చెందిన ఘటన మంథని మండలం గోపాల్‌పూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సింగరేణి విశ్రాంత ఉద్యోగి తుమ్మల మల్లయ్య(70) టేకు పూల కోసం ఇంటి పరిసరాల్లోని చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డారు. కుటుంబ సభ్యులు వెంటనే మంథని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య శశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.



మల్లయ్య

గోదావరిలో మునిగి యువకుడు

అంతర్గాం(పాలకుర్తి): గోలివాడ సమీపంలోని గోదావరిలో మునిగి సయ్యద్ ఇమ్రాన్(27) మృతి చెందారు. రామగుండం ఏ-పాకానికి చెందిన ఇమ్రాన్ మిత్రులతో కలిసి మంగళవారం గోలివాడ వద్ద విందు చేసుకున్న అనంతరం గోదావరిలోకి దిగి స్నానం చేస్తూ గల్లంతయ్యాడు. బుధవారం మధ్యాహ్నం మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెలికితీశారు. ఇమ్రాన్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

కమాన్‌పూర్, మల్హర్, న్యూస్‌టుడే : మల్హర్ మండలంలోని మల్లారం శివారులో లారీ ఢీకొని పెద్దపల్లి వాసి దుర్మరణం చెందారు. కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటకు చెందిన గొడిశెల శ్రీకాంత్(32).. స్థానిక ఉపరితల గనిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మల్హర్ మండలం చిన్నతూండ్లలో పుట్టింటికి వెళ్లిన భార్య, పిల్లల వద్దకు మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మల్లారం శివారు సమీపంలో వెనుకనుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం చోటుచేసుకుందని బంధువులు ఆందోళనకు దిగారు. మృతునికి 8 ఏళ్లలోపు ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి భార్య సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరికృష్ణ తెలిపారు.

చోరీ కేసులో ఒకరికి జైలు, జరిమానా

సిరిసిల్ల గ్రామీణం: చోరీ కేసులో ఒకరికి జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్ల పట్టణ పరిధిలోని పెద్దబోనాలకు చెందిన భైరగాని శ్రీనివాస్ బైపాస్ రోడ్డులో టిఫిన్ సెంటర్ నడిపేవాడు. 2023 డిసెంబర్ 11న అందులో చోరీ జరిగిందని సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి పెద్దపల్లి జిల్లా బ్రాహ్మణపల్లికి చెందిన మడక చిరంజీవిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జడ్జి ఒక సంవత్సరం జైలు శిక్షతోపాటు రూ.100 జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు.

సాహితీ విరులు.. సాంస్కృతిక సిరులు

- బతుకమ్మ పాటల్లో ప్రాచీన సౌందర్యం
- భావి తరాలకు అందిస్తున్న అక్షర శ్రామికులు



బతుకమ్మ పుస్తకాలు

అతివలు ఆనందంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ సాంస్కృతిక వారధిగా నిలుస్తోంది.. పూజలకు వినియోగించే పూలనే కొలిచే వేడుక జానపదుల జీవన సౌందర్యానికి అద్దం పడుతోంది.. ఆచార వ్యవహారాలు, పల్లె వాసుల కష్టాలను ప్రతిబింబించేలా అలతి పదాలతో మహిళల నోటి నుంచి జాలువారే పాటలు నేటి తరానికి ప్రాచీన సంప్రదాయాలను అందిస్తున్నాయి.. శతాబ్దాల కిందటి చరిత్రను నేటి తరాలకు అందించడం వెనుక ఎంతో మంది గాయనీమణులతో పాటు సాహితీవేత్తల కృషి దాగి ఉంది..

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

మారుతున్న కాలంతో పాటే పండుగ నిర్వహణలో ఎన్నో మార్పులు వచ్చినా బతుకమ్మ పాటల్లో ఒకే రకమైన సాహిత్యం, రాగం శతాబ్దాలుగా పడతుల నోళ్లలో నానుతోంది. ఎంగిలిపూలతో ఆరంభమై సద్దులతో ముగిసే వేడుకను రోజుకో పేరుతో ఆడుకోవడం తెలంగాణకే ప్రత్యేకంగా నిలిచింది. వందల ఏళ్ల కిందట పుట్టిన గీతాలు వారసత్వ సంపదగా వస్తున్నాయి.

ప్రకృతి ఆరాధన

- బతుకమ్మ పాట ఆరంభంలో పంచ భూతాలను తలచుకోవడం ప్రకృతి ఆరాధనకు అద్దం పడుతుంది.
- సూర్యచంద్రులు, భూమి, గంగ, ఇష్ట దేవతలు, కుల దైవాలు, ఇలవేల్పుల పాటల్లో స్తుతి కనిపిస్తుంది. ఇది ప్రాంతాన్ని బట్టి మారుతుంది. మన ప్రాంతంలో వేములవాడ రాజన్న, కొమురవెల్లి మల్లన్న, రాముడిని, కృష్ణుడిని తలచుకుంటూ పాడుకుంటారు.
- పండుగ పుట్టు పూర్వోత్తరాలను తెలిపే అంశాలను అనాదిగా బతుకమ్మ పాటలుగా అల్లుకున్నారు.
- లక్ష్మీదేవిని, పార్వతిదేవిని పేరంటాలుగా, ప్రకృతికి రూపంగా భావిస్తూ పాటల్లో వల్లె వేస్తారు.

పుట్టుకపై భిన్న కథలు

క్రీ.శ.16వ శతాబ్దానికి చెందిన భట్టు నరసింహ కవి రాసిన 'శ్రీలక్ష్మి దేవి ఉయ్యాలో.. సృష్టి బతుకమ్మయ్యే ఉయ్యాలో..' అంటూ సాగే పాట రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రాచుర్యంలో ఉంది. ఈ పాటలోనే బతుకమ్మ పుట్టు పూర్వోత్తరాలు వివరించారు. చోళ దేశ రాజు ధర్మాంగుడు, సత్యవతి దంపతులు శత్రువుల చేతిలో వంద మంది కుమారులను పోగొట్టుకోగా శ్రీలక్ష్మీదేవి అనుగ్రహించి సత్యవతి కడుపున తానే కూతురుగా జన్మిస్తుంది. ఆ శిశువును చూసి దేవతలు, మునులు చల్లగా బతకమంటూ 'బతుకమ్మ' అని దీవిస్తారు. శ్రీమహావిష్ణువు చక్రాంగుడనే పేరుతో జన్మించి రాజు వేషంలో వచ్చి బతుకమ్మను పెళ్లి చేసుకొని సిరిసంపదలతో, సంతానంతో సుఖంగా ఉన్నారనే కథ ప్రచారంలో ఉంది.

- మరో కథలో గౌరీదేవి మహిషాసురుడిని వధించాక అలసి అశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు సొమ్మసిల్లి పడిపోతుంది. ఆమెను స్పృహలోకి తేవడానికి మహిళలందరూ దేవిని బతుకమ్మ అని ప్రార్థిస్తూ పాటల రూపంలో వేడుకోగా దశమి రోజున తేరుకుంటుంది. నాటి నుంచి ఆమెను బతికిన అమ్మ, బతుకమ్మగా కొలుస్తున్నారని ప్రచారంలో ఉంది.

ఇక్కడి ఆడపిల్లల సొత్తు



భారతీయ సంస్కృతిలో మహిళకు అత్యంత గౌరవ స్థానం ఉంది. ఇది మనకు పురాణాలు, గ్రంథాల ద్వారా నిరూపితమైంది. సీతారాములు, రాధాకృష్ణులు, పార్వతీపరమేశ్వరులు.. ఇలా స్త్రీ దేవతలతో కూడిన గీతాలను బతుకమ్మ పాటలుగా పాడుకుంటాం. నా చిన్నతనంలో విన్న మంచి పాటలు నేడు కనుమరుగయ్యాయి. సంస్కృతిని భావి తరాలకు అందించాలన్న ఉద్దేశంతో కొన్నింటిని సేకరించాను. ప్రస్తుత కాలానికి అనుగుణంగా మార్పులు చేసి పుస్తక రూపంలో తీసుకొచ్చా. ఐదుసార్లు ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రాంతాలు తిరిగి బహుళ ప్రాచుర్యంలో ఉన్న వాటిని తీసుకున్నా. తెలంగాణ ప్రాంతంలో పుట్టిన ఆడబిడ్డల సొత్తు ఈ పాటలు.

– డా.అడువాల సుజాత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

ఆకాంక్షను ఇనుమడింపజేసేలా..



బతుకమ్మ పాటల స్ఫూర్తితో సుదీర్ఘ తెలంగాణ ఉద్యమంపై బతుకమ్మ పాట రాశాను. ఇందులో రాష్ట్ర భౌగోళిక పరిస్థితులు, జిల్లాల వారీగా వనరులు, ఇక్కడి ప్రజల సమస్యలను, ఆకాంక్షను వివరించా. అన్ని అంశాలను ఇనుమడింపజేసేలా పాటగా తీసుకొచ్చా. ఇందుకు నా భర్త లక్ష్మీనారాయణ సహకారం తీసుకున్నా.

– సబ్బని శారద, కరీంనగర్

మూడు జిల్లాల్లో సేకరించా..



వందల ఏళ్ల కిందటి బతుకమ్మ పాటలు అర్థవంతంగా ఉండేవి. బతుకమ్మ ఆట అతివలకు మంచి వ్యాయామం కూడా. నేను పౌరాణిక గీతాలు, పెళ్లి పాటలు, మంగళ హారతులు వంటి పాటలు రాశా. ఈ ప్రాంత మహిళలకు ఎంతో ఇష్టమైన బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగల సంస్కృతి బతికించడానికి పాటలు సేకరించా. కరీంనగర్, వరంగల్, నల్గొండ ప్రాంతాల్లో పని చేసినపుడు బతుకమ్మ పాటలు సేకరించి పుస్తకంగా తీసుకొచ్చా. అమెరికాలోని తెలుగువారు పండుగ వేళ ఎంతో ఇష్టంగా పాడుకుంటున్నారు. ఇప్పటి పిల్లలు డీజేలు, రికార్డింగ్ పాటలపై వేస్తున్న గెంతులు చూసి మా తరం వారికి బాధనిపిస్తోంది.

– డా.ఆర్.కమల, విశ్రాంత అధ్యాపకురాలు

ప్రశాంత జీవనం అవగాహనే ప్రధానం



నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం, రాయికల్

తరచూ అనవసర ఆందోళనలకు గురికావడం, ఒంటరిగా ఉండటం, మతిమరుపు ఇలాంటి అనేక సమస్యలు మానసిక అనారోగ్యం జాబితాలోనివే. శారీరకంగా ఎంత ఆరోగ్యకరంగా ఉన్నా.. మానసిక ప్రశాంతత లేకపోతే జీవనయానం గతి తప్పుతుంది. దీర్ఘకాలిక రుగ్మతలకు దారి తీస్తుంది. ఇలా అనేక మానసిక సమస్యలు, నివారణపై అవగాహన కలిగించేందుకు ఏటా అక్టోబరు 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య సంస్థ 1992 నుంచి ఏటా ఒక్కో నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. 2024లో 'పని ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యం' నినాదంతో ముందుకొచ్చింది.

ప్రత్యేక వైద్య విభాగాలు..: మానసిక సమస్యలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా వైద్య విభాగాలను ఏర్పాటు చేసి చికిత్సను అందుబాటులోకి తెచ్చారు. మద్యం, ధూమపానం, మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిని సైతం వాటి నుంచి దూరంచేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు ఆయా విభాగాలు కృషి చేస్తున్నాయి.



ఖని ప్రభుత్వ ఆసుపత్రిలోని మానసిక వైద్య విభాగం

- గతేడాది నుంచి ఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో మానసిక వైద్య విభాగం సేవలందిస్తుంది. సాధారణ సమస్యలతో వచ్చే వారికి ఓపీలోనే వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చి పంపిస్తుండగా.. తీవ్రత ఉన్న వారిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకొని చికిత్స చేస్తున్నారు.

2024 మార్చి నుంచి ఖనిలో ఓపీ తీరు	నెల	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జులై	ఆగస్టు	సెప్టెంబర్
	ఓపీ	153	133	166	144	153	109	153

ఈ లక్షణాలుంటే..

- **స్కిజోఫ్రీనియా:** వారిలో వారే మాట్లాడుకోవడం, నవ్వుకోవడం, ఎదుటివారు తనకు హాని చేస్తారేమోననే అనుమానంతో ఆందోళనకు గురికావడం.
- **కుంగుబాటు:** తమను తామే నిందించుకోవడం, చేస్తున్న పనిపై ఆసక్తి కనబరచకపోవడం, త్వరగా అలసిపోవడం, తమను తాము గాయపరుచుకోవడంతో పాటు ఆత్మహత్యలకు యత్నించడం.
- **ఓసీడీ:** ఆబ్సెస్సివ్ కంపల్సివ్ డిసార్డర్(ఓసీడీ) లక్షణాలున్నవారు చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు. ఒకటే ఆలోచనను పదే పదే చెబుతుంటారు. ఉదాహరణకు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్తున్నా మళ్లీ వెనక్కి వచ్చి సరిచూసుకుంటారు.
- **చిన్నపిల్లలు:** ప్రధానంగా చిన్నపిల్లలు అటెన్షన్ డెఫిషిట్ హైపరాక్టివిటీ డిసార్డర్(ఏడీహెచ్‌డీ), అటిజం తదితర మానసిక సమస్యలకు లోనవుతుంటారు. చదువుపై ఆసక్తి కనబరచకపోవడం, మిగతా పిల్లలతో కలవకుండా ఉండటం తదితర లక్షణాలు.

ముందస్తుగా గుర్తిస్తేనే నివారణ

మానసిక సమస్యలను ముందస్తుగా గుర్తిస్తేనే ప్రాథమిక స్థాయిలో నివారించవచ్చు. వ్యక్తి ప్రవర్తనలో మార్పులను గమనించే కుటుంబ సభ్యులు వారికి చికిత్స ఇప్పించడంలో కీలకం. గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో మానసిక వైద్య విభాగంలో వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి తీవ్రంగా ఉన్నవారికి ఇన్‌పేషెంట్లుగా చేర్చుకొని చికిత్స చేస్తున్నాం.

- రవివర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్(మానసిక వైద్యం) ప్రభుత్వ వైద్య కళాశాల, ఖని

తమ్ముడిని చంపిన అన్న


చంద్రయ్య

శంకరపట్నం (సైదాపూర్), న్యూస్‌టుడే : కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దెనపల్లిలో దారుణం చోటు చేసుకుంది. అన్న చేతిలో తమ్ముడు హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. దుద్దెనపల్లికి చెందిన కుందేళ్ల ప్రేమలత- రాజయ్య దంపతులకు ఇద్దరు కుమారులు కుమారస్వామి, చంద్రయ్య (31) ఉన్నారు. తండ్రి రాజయ్య ఉపాధి కోసం సుమారు అయిదేళ్ల కిందట దుబాయ్‌కు వెళ్లాడు. తల్లితోపాటు ఇద్దరు కుమారులు ఉంటున్నారు. కుమారస్వామి వివాహితుడు కాగా, చంద్రయ్యకు వివాహం కాలేదు. ఇద్దరు సొంత వ్యవసాయం చూసుకోవడంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తారు. అన్నదమ్ముళ్ల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి చంద్రయ్య మద్యం తాగి వచ్చి అన్న కుమారస్వామితో గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. వీరిద్దరిని ఆపేందుకు తల్లి ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఆవేశంలో కుమారస్వామి అక్కడే ఉన్న ఇనుపరాడ్‌తో దాడి చేయగా చంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకొన్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, పట్టణ సీఐ తిర్మల్ గౌడ్, ఎస్సై తిరుపతి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గ్రామస్థులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్నదమ్ముల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆ క్రమంలోనే తమ్ముడిని హత్య చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రావుల శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

జగిత్యాల వ్యవసాయం : ఉమ్మడి జిల్లాలో రాగల నాలుగు రోజుల్లో అక్కడక్కడ తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షసూచన ఉందని పొలాస పరిశోధనస్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. గాలిలోతేమ 59-94 శాతం, ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 22-23, గరిష్ఠంగా 32-34 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని వివరించారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న వాహనం


కొండగట్టు సమీపంలో బోల్తా పడ్డ వ్యాను

మల్యాల, న్యూస్‌టుడే: ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి వ్యాను అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఈ సంఘటన మల్యాల మండలం ముత్యంపేట పరిధిలోని కొండగట్టు ప్రాంతంలో జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. వంటనూనె ప్యాకెట్లలోడ్‌తో కామారెడ్డి నుంచి మంచిర్యాల వెళ్తున్న డీసీఎం వ్యాను కొండగట్టు ప్రాంతంలోని మారుతిటౌన్ షిప్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి రహదారి పక్కనున్న చెట్టును ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవరు నర్సింహులు క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో దాదాపు గంటసేపు ఇబ్బంది పడ్డారు. మల్యాల ఎస్సై నరేష్, జగిత్యాల అగ్నిమాపక అధికారి కృష్ణకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని క్యాబిన్‌ను కత్తిరించి డ్రైవరును బయటకు తీసి చికిత్స కోసం 108లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. మల్యాల పోలీసులు రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఎల్ఎఫ్‌జి మధు, ఆపరేటర్ మల్లేశం, ఫైర్‌మ్యాన్లు వేణు, రాజేందర్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం వరకు వరద 52,830 క్యూసెక్కులకు పెరిగింది. 10 స్పిల్‌వే గేట్లను తెరచి 31,240 క్యూసెక్కుల మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఎస్కేప్‌గేట్ల ద్వారా 1,200 క్యూసెక్కులను గోదావరిలోకి మళ్లిస్తుండగా వరదకాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని వదిలి మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. ఇతర కాలువలు, ఎత్తిపోతలు కలుపుకుని మొత్తం ఔట్‌ఫ్లో 52,380 క్యూసెక్కులుగా ఉంది.

అశ్వవాహనంపై ఊరేగిన స్వామివార్లు



ఉత్సవ మూర్తుల పెద్ద సేవలో అర్చకులు, భక్తులు: కాళరాత్రి అలంకారంలో అమ్మవారు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రీ దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు కాలరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, శ్రీరాజరాజేశ్వరిదేవికి చతుష్షష్టి పూజలను ఘనంగా నిర్వహించారు. నాగిరెడ్డి మండపంలో గాయత్రి జపం, చండీ హోమం, గాయత్రి హవనాన్ని అర్చకులు వేద మంత్రోచ్చారణలతో జరిపించారు. మూల నక్షత్రం సందర్భంగా పుస్తక రూపిణి మహా సరస్వతి అమ్మవారికి, బాల త్రిపుర సుందరి దేవికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శ్రీ రాజరాజేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ సమేత అనంత పద్మనాభస్వామివార్ల ఉత్సవమూర్తులకు వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద సేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పట్టణంలోని ప్రధాన వీధుల్లో అశ్వవాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఏఈవో శ్రీనివాస్, అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణపై అమ్మాయిల ఆసక్తి

న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్)


కర్రసాములో శిక్షణ పొందుతున్న బాలికలు

ప్రస్తుత సమాజంలో మహిళలపై నానాటికీ అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. బాలికలు, యువతులు, మహిళలు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకునే వరకు కుటుంబీకులకు ఆందోళన తప్పడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునేందుకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరం. అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు మహిళలు ఆత్మరక్షణ చర్యలు చేపట్టాలి. అందుకుగాను మార్షల్ ఆర్ట్స్ ప్రాధాన్యతను తెలియజేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం 'హర్ ఘర్ దుర్గా' పేరుతో నవరాత్రుల సమయంలో ఉచితంగా శిక్షణ అందిస్తోంది.

సిరిసిల్లలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో 'హెల్పింగ్ హార్ట్స్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కర్రసాములో ఉచిత శిక్షణ అందిస్తున్నారు. పదిహేనురోజుల పాటు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు నేర్పుతున్నారు. 12 సంవత్సరాల బాలికల నుంచి 25 ఏళ్ల మహిళలు, యువతులు ఇందులో పాల్గొనవచ్చు. మొత్తం 60 మంది ఈ శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 3న ప్రారంభమైన ఈ శిక్షణ 21 వరకు కొనసాగుతుంది. ఇందులో ప్రావీణ్యం పొందడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు ఆత్మస్థైర్యం పొందుతారు. తమను తాము రక్షించుకోగలమనే ధైర్యం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

చాలా సంతోషంగా ఉంది - శ్రీనిజ




నేను సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాను. కర్రసాములో శిక్షణ పొందడం చాలా ఆనందంగా ఉంది. శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం ఏర్పడుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది.

ఆత్మస్థైర్యం పెరుగుతుంది - సంజన



నేను ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. పండగ సెలవులకు ఇంటికి వచ్చాను. హెల్పింగ్ హార్ట్స్ వారు ఉచితంగా కర్రసాము శిక్షణ అందించడం హర్షణీయం. కఠిన పరిస్థితుల్లోనూ మనల్ని మనం రక్షించుకోగలమనే ఆత్మస్థైర్యం ఏర్పడుతుంది.

ఎంతో అవసరం



బాలికలు, మహిళలపై రోజురోజుకీ అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. అందుకే ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. 60 మంది మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

- కనుకుంట్ల పున్నంచందర్, హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు

సద్వినియోగం చేసుకోవాలి - వొడ్నాల శ్రీనివాస్, శిక్షకుడు



బాలికలు, మహిళలు ఉచిత కర్రసాము శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల అనేక లాభాలున్నాయి. శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. జీవితంలో కఠిన పరిస్థితులను ఎదుర్కొనేలా ఇవి మనల్ని తయారు చేస్తాయి.